సాక్షి చిత్తూరు

గురువారం । 1 । ఆగస్టు । 2024



నిఘా వ్యవస్థ పటిష్టం చేయండి

నేరాలపై జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఎస్పీ మణికంఠ చందోలు సమీక్షించారు. సీసీ కెమెరాలు విరివిగా ఉపయోగించాలన్నారు. - 8లో



సేంద్రియంపై అధ్యయనం

నగరి నియోజకవర్గంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను రాజస్థాన్ బృందం అధ్యయనం చేసింది. - 8లో



ఆడికృత్తిక ఉత్సవాలు పరిసమాప్తం

శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

కలెక్టర్ 83 ఫిర్యాదులు స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై 83 ఫిర్యాదులు స్వీకరించారు. 53 మంది రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. మరో 30 ఫిర్యాదులు వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. స్వీకరించిన ఫిర్యాదులకు రసీదులు ఇవ్వాలని, వీటన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, డ్వామా పీడీ రాజశేఖర్, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 21 సమస్యలు

– ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు



చిత్తూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఈ శేషాద్రి

చిత్తూరు కార్పొరేషన్: తమ దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. బుధవారం జిల్లాలోని ఈఈ కార్యాలయాల్లో నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌లో మొత్తం 21 సమస్యలు వినియోగదారులు నివేదించారని, వీటిలో 7 సమస్యలను పరిష్కరించామన్నారు. ఎక్కువగా బిల్లింగ్ సమస్యలు, కేబుల్, కరెంటు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఏర్పాటు, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు..ఇత్యాది వాటిపై ఫిర్యాదులు అందుతున్నట్టు చెప్పారు. చిత్తూరులోని ఫిర్యాదుల కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, హరి, డీఈలు శేషాద్రి, పద్మనాభపిళ్లై జ్ఞానేశ్వర్, ఏఈలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పనులకు ప్రతిపాదనలు పంపండి

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో జెడ్పీటీసీల పరిధిలో రూ.30 లక్షలు, ఎమ్మెల్యేల పరిధిలో రూ.50 లక్షల అంచనాలతో పనులు చేయడానికి ప్రతిపాదనలు పంపాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. ఇందులో 50 శాతం పనులు వాటర్ వర్క్స్, మిగిలినవి రోడ్లు, కాలువల పనులకు వాడుకోవాలన్నారు. మండలాల వారీగా జెడ్పీటీసీలు సంబంధిత పనుల వివరాలు, అంచనా వ్యయంతో వివరాలను సిద్ధం చేసి రెండు వారాల్లోపు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఇసుక బకాసురులు

అధికారంలోకి వస్తే ఇసుక ఉచితం అని ప్రకటించిన చంద్రబాబునాయుడు హామీ తెలుగు తమ్ముళ్లకు వరంలా మారింది. ప్రజలు ఇసుక కోసం నానాకష్టాలు పడుతుంటే అధికారం అడ్డు పెట్టుకుని టీడీపీ నాయకులు ఇసుక బకాసురులయ్యారు. వాగులు, వంకలు, నదీ పరివాహక ప్రాంతాల్లోనే కాకుండా చెరువుల్లోని ఇసుకను సైతం కొల్లగొడుతున్నారు. అంతేకాకుండా డంప్‌ల్లోని ఇసుకను కూడా ఫ్రీగా కొట్టేస్తున్నారు! రేయింబవళ్లూ అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. మరోవైపు అడ్డుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులు యత్నిస్తే వారిపై దాడులకు దిగుతున్నారు. ఇది అధికారులకు తెలిసినా ఒత్తిళ్ల మూలాన చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.



దిగువమాసాపల్లిలోని ఇసుక స్టాక్ పాయింట్

- జిల్లాలో జోరుగా తెల్లబంగారం దోపిడీ
- అధికారికంగా మూడు డంప్‌లు మాత్రమే
- ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- వాగులు, వంకలు, చెరువులనూ వదలని తెలుగు తమ్ముళ్లు
- డంప్‌లోనూ ఫ్రీగా ఇసుక కొట్టుడు..!
- రేయింబవళ్లూ అడ్డగోలుగా తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

అనుమతులున్న స్టాక్ పాయింట్లు	3
ఇసుక తరలింపు పాయింట్లు	2
టన్నుకు చెల్లింపు	రూ.155
ట్రాక్టర్‌లో 5 టన్నులకు	రూ.775
టిప్పర్‌లో 10 టన్నులకు	రూ.1550
రోజువారీగా ఇసుక విక్రయాలు	1500 టన్నులు
ఆదాయం	రూ.2 లక్షల వరకు
రోజూ అక్రమంగా తరలిస్తున్న ఇసుక	1500 టన్నులకు పైగా
ప్రభుత్వ ఆదాయానికి పడుతున్న గండి	రూ.2లక్షల వరకు
ప్రజలకు విక్రయిస్తున్న ధర (ట్రాక్టర్)	రూ. 2,500-రూ.3000
మినీ టిప్పర్ ఇసుక ధర	రూ.6 వేల నుంచి రూ.8వేల వరకు
పెద్ద టిప్పర్ ఇసుక	రూ. 14 వేల నుంచి రూ. 18వేల వరకు
అధికారికంగా ఇసుక తరలింపు, విక్రయంతో	రూ.9లక్షల వ్యాపారం
తమిళనాడు, కర్ణాటకకు అక్రమంగా ఇసుక తరలిస్తూ	రూ.50 లక్షలకు పైగా ఆదాయం
ఇసుక తరలింపులకు తిరుగుతున్న వాహనాల సంఖ్య	200 వరకు

చిత్తూరు టాస్క్‌ఫోర్స్: జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం మూడు ఇసుక డంప్‌లకు అనుమతి ఇచ్చింది. చిత్తూరు మండలంలోని దిగువమాసాపల్లె, పాలూరు, గంగవరం మండలం గండ్రాజుపల్లెలో డంప్‌లను ఏర్పాటు చేసి ఇసుక విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాక్ పాయింట్లలో టన్నుకు రూ.155 చొప్పున వసూలు చేయాలని ఆదేశాలిచ్చింది. ఈ లెక్కన ట్రాక్టర్‌లో 5 టన్నులకు గాను రూ.775, టిప్పర్‌లో 10 టన్నులకు గాను రూ,1550 కట్టించుకుంటున్నారు. ఒక్కొక్క స్టాక్ పాయింట్ నుంచి అధికారికంగా 750 టన్నులు మాత్రమే అమ్ముడుపోతోంది. అనధికారిక లెక్కల ప్రకారం 1000 టన్నులు దాటుతోంది. రాత్రి వేళ రీచ్‌లలో 500 టన్నులకు పైగా కాజేస్తున్నారు. ప్రతిరోజూ 160 నుంచి 200 వాహనాలు వస్తున్నట్లు లెక్కలున్నాయి. రాత్రి వేళ పదుల సంఖ్యలో మూడోకంటికి కనబడకుండా రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇసుకకు ఫీజు కడుతుంటే ఇసుకాసురులు మాత్రం ఎంచక్కా ఫ్రీగా తీసుకెళుతున్నారు!



కాణిపాకం వద్ద బాహుదా నదిలో ఇసుక తవ్వకానికి రోడ్డు వేసుకుంటున్న టీడీపీ నాయకులు



పట్ట కప్పి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

ఇసుక అక్రమ తవ్వక ప్రాంతాలు

కాణిపాకంలోని బాహుదా నది, జీడీనెల్లూరు అగ్రహారం రీచ్, పూతలపట్టు వావిల్‌తోట, వేపనపల్లె వంకల్లో, తవణంపల్లె తదితర ప్రాంతాల్లోని వాగులు, వంకల్లో కూడా ఇసుకను దోచేస్తున్నారు. అలాగే పలమనేరులోని కేటిల్‌ఫామ్, ముసిలిమడుగు, తెంగరగుంట, క్రిష్టాపురం, సముద్రపల్లె, గంగవరం, పెద్దపంజాణి ప్రాంతాల్లోని కౌండిన్య నది, నగరిలోని కుశస్థలి నది ప్రాంతాల్లో జోరుగా అక్రమ ఇసుకను తోడేస్తున్నారు.

గోల్‌మాల్

ఇసుక తరలింపులో దర్జాగా గోల్‌మాల్ చేస్తున్నారు. ఆధార్ నంబర్ ఒకరిదైతే..మరొకరు ఇసుక తరలింపులు చేస్తున్నారు. వాహన నంబర్లను మార్చి ఇసుకను సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా ఇసుక తరలించడానికి తమిళనాడు వాహనాలు సైతం క్యూ కడుతున్నాయి. టీఎన్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కొన్ని వాహనాల నంబర్ ప్లేట్లకు రంగులు వేసి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. కండిషన్ లేని వాహనాలు, ట్యాక్స్ కట్టని బండ్లు కోకొల్లలుగా దర్శనమిస్తున్నాయి. అక్రమ రవాణా సమయంలో మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నాయి. ప్రధానంగా ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లుగా మైనర్లు, లైసెన్స్ లేని వ్యక్తులు ఉండటం గమనార్హం! అధికారుల ఉదాసీనత వల్ల 'మూడు ట్రాక్టర్లు.. ఆరు లారీలు' అన్న చందాన ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోందని ప్రజలు మండిపడుతున్నారు.

> **కాపలాదారులకు కాసులు**
>
> స్టాక్ పాయింట్లలో కాపలాదారులుగా రెవెన్యూ సిబ్బందికి డ్యూటీలు వేశారు. ఒక్కొక్క పాయింట్‌కు ఇద్దరు వీఆర్ఏలు ఉంటున్నారు. ఇదే అదునుగా భావించి అక్రమార్కులతో చేతులు కలిపారు. వారి నుంచి ప్రతిఫలం పొందుతున్నారు. ఒక్క రాత్రికి ఒక్కొక్కరు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు పొందుతున్నట్టు రెవెన్యూ సిబ్బంది ద్వారా తెలియవచ్చింది.

ఇసుకాసురులైతే రైట్..రైట్..!

మూడు డంప్‌ల నుంచి ఇసుక అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పాలూరు, దిగువమాసాపల్లె డంప్‌ల నుంచి తెలుగు తమ్ముళ్లకు ఉచితంగా తరలించేందుకు అధికారులు రైట్..రైట్ చెబుతున్నారు. ఇక్కడి నుంచి రోజుకు 50 పైగా టిప్పర్లు, వందలాది ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. ఇక్కడ కొంతమంది టీడీపీ నేతలు ఒక టోకెన్ తీసుకుని పదుల సంఖ్యలో ఇసుక లోడ్లు పట్టుకుపోతున్నారు. మరికొందరు నిబంధనలు తమకేమీ వర్తించవనే రీతిలో టన్నులు.. టన్నులుగా కొల్లగొట్టేస్తున్నారు. బీఎస్ఆర్‌పేట, ఆనగల్లు రీచ్‌ల్లో అనధికారికంగా తవ్వేస్తున్నారు. దీనికి చెక్ పెట్టే యంత్రాంగం కరువవడంతో వారికి ఇసుక సిరులు కురిపిస్తోంది. ఇలా దోచుకున్న ఇసుకలోడుకు పైన ప్లాస్టిక్ పట్ట కప్పి బీఎస్ఆర్‌పేట మీదుగా తమిళనాడు, గుడిపాల, బెంగళూరు ప్రాంతాలకు తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక గుండ్రాజుపురంలో స్టాక్ పాయింట్ ప్రాంతం లీజుకు ముగియడంతో ఇసుక రవాణా ఆగిపోయింది.

అడ్డుకునే యత్నం చేస్తే దాడి

ఇటీవల దిగువమాసాపల్లె స్టాక్ పాయింట్‌లో సచివాలయ ఉద్యోగి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు టీడీపీ నాయకులు అతడిపై దాడిచేసి చితకబాదారు. ఈ సంఘటనతో సిబ్బంది ఉదయం పూట డ్యూటీలంటేనే హడలిపోతున్నారు. టీడీపీ నేతలు ఇసుక పాయింట్లలో కాపు కాసి అక్కడి సిబ్బందిపై పెత్తనం చేస్తున్నారు. అలాగే పోలీసులను కూడా నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తమకు ఇసుక డ్యూటీలు వద్దు మహాప్రభో అని మొత్తుకుంటున్నా డ్యూటీలు వేస్తున్నారని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు.



పాలూరు ఇసుక డంప్ (ఫైల్)

మా బాబే.. తెల్ల బంగారం

పలమనేరు: కౌండిన్య నదిలోని క్యాటిల్ ఫామ్ వద్ద అటవీశాఖ భూముల్లో సైతం ఇసుకను తోడేస్తున్నారు. ఫలితంగా అక్కడి నగరవనంలోని మహా వృక్షాలు కూలే స్థితికి చేరాయి. ఇక మున్సిపాలిటీకి మంచి నీటిని సరఫరా చేసే కౌండిన్యలోని బోర్ల వద్ద సైతం ఇసుకను తోడేస్తున్నా మున్సిపల్ అధికారులు మౌనముద్ర దాల్చారు. కౌండిన్యలోని క్యాటిల్‌ఫామ్ నుంచి సముద్రపల్లె, క్రిష్టాపురం, ముసలిమొడుగు ప్రాంతాల్లో పోటాపోటీగా జేసీబీలు పెట్టి ఇసుకను భారీగా తరలిస్తున్నారు. మరికొందరు రహస్య ప్రదేశాలు, మామిడి తోపులు, పొలాల వద్ద ఇసుక డంప్ చేస్తున్నారు. దీనిపై కడుపు మండిన కొందరు స్థానికులు సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. అంతేకాకుండా రేయింబవళ్లూ ఇసుక ట్రాక్టర్లు హైవే మీదుగా పట్టణంలోకి వస్తున్నా పోలీసులు, సెబ్, రెవెన్యూ పట్టించుకోవడం లేదు. ఇదే మార్గంలోని ఆర్డీఓ, ఇరిగేషన్, తహసీల్దార్ కార్యాలయాల ముందు, అలాగే పోలీస్ స్టేషన్ ఎదుటే ఇసుక ట్రాక్టర్లు దర్జాగా పోతున్నా చర్యలు శూన్యం.



సెబ్ సీఐతో వాగ్వాదానికి దిగిన ఇసుకాసురులు(ఫైల్)

"నదిలో అయినా..ఏ కాలువ అయినా ఇసుకుంటే ..వాళ్లకి ట్రాక్టర్ ఉంటే ట్రాక్టర్‌కి.. ఎడ్లబండి ఉంటే ఎడ్లబండికి..నెత్తిమీద పెట్టుకోవాలంటే నెత్తిమీద పెట్టుకుని తీస్కా పొమ్మంటున్నాం..వాటెవర్ యు వాంట్..ఎవడొద్దన్నాడు.." ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ఇసుకోపదేశమిది! ఇది ఇప్పుడు ఇసుకాసురుల సెల్‌ఫోన్లలో హల్‌చల్ చేస్తోంది. గత నెల 18న క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్య నదిలో ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పలమనేరు సెబ్ సీఐ సురేష్‌రెడ్డి సీజ్ చేశారు. దీంతో ఇసుకను తరలిస్తున్న వ్యక్తులు సీఐతో వాగ్వాదానికి దిగారు. సాక్షాత్తు సీఎం చంద్రబాబునాయుడే ఇసుకను తరలించుకోమని చెప్పాడంటూ.. తన సెల్‌ఫోన్‌లో ఓ వీడియోను ప్లే చేసి చంద్రబాబు మాటలను వినిపించడంతో అధికారులు నోరెళ్లబెట్టారు!



సీఎం వీడియోను చూపుతున్న దృశ్యం

చక్కెర, కందిపప్పేదీ?

కూటమి ప్రభుత్వం రేషన్ సరుకులకు కోతలు పెడుతోందనే విమర్శలొస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే బియ్యం, పంచదార, కందిపప్పు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు కేవలం బియ్యం పంపిణీతోనే సరిపెడుతోంది. జూలైలో రేషన్ డీలర్లకు బియ్యం మాత్రమే పంపిణీ చేసింది. ఆగస్టుకు సంబంధించి కూడా కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేయడంతో పంచదార, కందిపప్పుకు మంగళం పాడిందా!? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- అరకొరగా రేషన్ పంపిణీ
- డీలర్లకు ఆగస్టు కోటా బియ్యం మాత్రమే సరఫరా!
- 'ఇంటికే రేషన్' రద్దు ఆలోచనలో ప్రభుత్వం
- ప్రశ్నార్థకంగా ఎండీయూ వాహనాల పరిస్థితి
- లబోదిబోమంటున్న 5.67 లక్షల కార్డుదారులు

కాణిపాకం: జిల్లాలో 5,31,019 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా రేషన్ లబ్ధిదారులకు 15 వేల టన్నుల బియ్యం, 534 టన్నుల కందిపప్పు, రాగులు 300 టన్నులు, 270 టన్నుల పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. గత ప్రభుత్వ పాలనలో ఎండీయూ వాహనాలతో ఇంటికే రేషన్ పంపిణీ చేశారు. కార్డులో లబ్ధిదారులకు 5 కిలోల చొప్పున ఉచిత బియ్యంతో పాటు కుటుంబానికి కిలో కందిపప్పు, అరకిలో పంచదారను రాయితీపై సరఫరా చేశారు. దీనికితోడు రాగులు, గోధుమ పిండి ఇచ్చేవారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఇబ్బంది పడకుండా వీటిని తీసుకునేవారు. అయితే తాము అధికారంలోకి వస్తే మరిన్ని రేషన్ సరుకులు తక్కువ ధరకే ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక తొలి నెలలోనే పంచదార, కందిపప్పు పంపిణీకి కోత పెట్టారు. రెండో నెల అయినా పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తారని భావిస్తే బియ్యంతోనే సరిపెడుతున్నారు.



రేషన్ పంపిణీ (ఫైల్)

ఎండీయూ వాహనాలకు మంగళం

పేదలకు ఇంటికే రేషన్ పంపిణీలో భాగంగా గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. అయితే టీడీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల వల్ల తీవ్ర నష్ట కలుగుతుందని, ఇంటికే రేషన్ పంపిణీ సరైన నిర్ణయం కాదని ఒక వ్యూహం ప్రకారం గత ప్రభుత్వ విధానంపై బురద చల్లడం మొదలెట్టింది. దీంతో ఎండీయూ వాహనాలకు త్వరలో మంగళం పాడనున్నారా? అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఇదే వాస్తవమైతే ఈ వాహనాలపై ఆధారపడి జీవిస్తున్న ఎందరో బడుగు జీవులు రోడ్డున పడే ప్రమాదం ఉంది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

- నేటి నుంచి నెలాఖరు వరకు..
- బాల కార్మికులను గుర్తిస్తే దుకాణదారులపై కేసులు
- అధికారుల సమన్వయ సమావేశంలో డీఆర్ఓ పుల్లయ్య



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆగస్టు 1వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నామని, దీనిని పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ పుల్లయ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులకు సమన్వయ సమావేశం నిర్వహించి డీఆర్ఓ మాట్లాడారు. ఆగస్టు నెలాఖరు వరకు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌కు నియమితులైన టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. 2020 నుంచి 2024 జూలై 31 వరకు జిల్లాలో 63 మంది బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించామని, అలాగే రూ.1,24,549 జరిమానా విధించి 47 మంది పిల్లలకు ఆ సొమ్మును అందజేశామన్నారు. పనుల నుంచి విముక్తి పొందిన బాల కార్మికులు సక్రమంగా బడికి వెళ్తున్నారా?లేదా? అన్నది పరిశీలించాలన్నారు. 14 ఏళ్ల లోపు పిల్లలు విధిగా బడిలో ఉండాలని, పనుల్లో కాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే వారిని పాఠశాలల్లో చేర్పించడంతో పాటు పనులు చేయించి దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను విధిగా బడికి పంపేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే బాల కార్మికులు పనిచేస్తున్నట్టు ఎవరి దృష్టికైనా వస్తే 1098 కాల్ చేసి తెలియజేయాలని కోరారు. జిల్లాలో, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఐసీడీఎస్, పోలీస్, వైద్యశాఖల అధికారులు సమన్వయంతో ఈ స్పెషల్ డ్రైవ్ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డీఈఓ దేవరాజు, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్‌రావు, సహాయ కార్మిక అధికారి మధుబాబు తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో గురువారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్టు డీఎస్ఓ శంకరన్ తెలిపారు. ఈనెలకు సంబంధించి 1,339 చౌకదుకాణాల పరిధిలోని 5,31,019 కార్డులకు గాను 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేశామన్నారు. కార్డుదారులు నిర్దేశిత సమయంలోపు సరుకులు తీసుకోవాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

డీఎడ్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించండి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని డీఎడ్ 2వ సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులు ఫీజులు చెల్లించాలని డీఈఓ దేవరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023–25వ సంవత్సరంలో డీఎడ్ 2వ సెమిస్టర్, ఒన్స్ ఫెయిల్డ్ (2021–23, 2022–2024)విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆగస్టు 11వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా, రూ.50 అపరాధ రుసుంతో ఆగస్టు 19వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 ఫీజు చెల్లించాలని తెలియజేశారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సదుం: జిల్లాలోని పులిచెర్ల (బాలికలు), పెద్దపంజాణి ఎంజేపీ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం (పీజీటీ) బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పీజీతో పాటు సంబంధిత సబ్జెక్ట్‌లో బీ.ఈడీ చేసి ఉండాలని, ఈనెల 5 లోపు సదుం గురుకుల పాఠశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో బుధవారం ముగ్గురు ఎంపీడీఓలు ఉద్యోగ విరమణ పొందడంతో వారి స్థానాల్లో ఇన్‌చార్జిలను నియమించారు. నగరి ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి స్థానంలో ఏఓ సతీష్, గుర్రంకొండ ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి స్థానంలో ఏఓ నాగశివారెడ్డి, చౌడేపల్లె ఎంపీడీఓ శివప్రసాద్ స్థానంలో ఈఓ పీఆర్డీ కృష్ణవేణిని ఇన్‌చార్జిలుగా నియమిస్తూ జెడ్పీ సీఈఓ గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు.

గుజిరి షాపు దగ్ధం

పుంగనూరు: గుజిరి షాపు దగ్ధమైన సంఘటన బుధవారం సాయంత్రం స్థానిక ఉబేదుల్లా కాంపౌండులో చోటుచేసుకుంది. ఇక్కడ ఇస్మాయిల్‌కు చెందిన గుజిరిషాపు ఉంది. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సమాచారం అందడంతో అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు ఫైరింజన్ సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలు ఆర్పారు. సుమారు రూ.25 వేల ఆస్తి నష్టం కలిగిందని ఆయన చెప్పారు.

సేంద్రియంపై అధ్యయనం

- అటల్ బూజల్ యోజన పథకం అమలుపై రాజస్థాన్ బృందం ఆరా
- సేంద్రియ వ్యవసాయం గురించి వివరించిన జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వాసు



కషాయాల తయారీని వివరిస్తున్న అధికారులు

నగరి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అటల్ బూజల్ యోజన పథకం కింద నగరి నియోజకవర్గంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను రాజస్థాన్ బృందం బుధవారం అధ్యయనం చేసింది. ఏడుగురు వ్యవసాయ పరిశీలకులు, ఆరుగురు రైతులతో కూడిన ఈ బృందం విజయపురం మండలం జగన్నాథపురంలో రైతు రుక్మిణి పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో జామతోటలో అంతర పంటగా సాగు చేసిన కూరగాయల పంటలను పరిశీలించారు. అలాగే నగరి మండలం కృష్ణరామపురంలో రైతు చంద్రశేఖర్ నిర్వహిస్తున్న రసాయనేతర విత్తన బ్యాంకును పరిశీలించారు. రసాయనాలకు బదులుగా వాడే కషాయాల తయారీపై ఆరా తీశారు. వారికి ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర హెచ్‌ఆర్ శ్రీనివాసులు, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వాసు.. నీమాస్త్రం, దశపర్ణి, సప్తధాన్య కురా, కోడిగుడ్డు, నిమ్మ ద్రావణం, వేపగింజల ద్రావణం తయారీ విధానాలను వివరించారు. 35 రకాల కూరగాయల మోడల్ విధానం, వాటి ఉపయోగాలు, ఏ గ్రేడ్, పీఎండీఎస్, ఎన్‌పీఎం షాప్ ఉపయోగాలను తెలియజేశారు. అనంతరం బృందం సభ్యులు ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘం సభ్యులతో ప్రకృతి వ్యవసాయంపై చర్చించారు. టీం హెడ్‌లు ప్రకాష్, వివేక్ మాట్లాడుతూ, అటల్ బూజల్ యోజన పథకాన్ని రాజస్థాన్‌లో అమలు చేస్తున్నామని, ఇక్కడ అనుసరించే సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏ గురుప్రసాద్, వ్యవసాయ పరిశోధకురాలు పుష్ప, రాష్ట్రస్థాయి అధికారి కల్పన, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్ల జనరల్ బోగీల్లో సౌకర్యాలు కల్పించండి

- రేణిగుంట రైల్వే స్టేషన్ స్థాయి పెంచండి
- పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి



పార్లమెంటులో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి అర్బన్: రైళ్ల జనరల్ బోగీల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని ఎంపీ గురుమూర్తి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ కోరారు. బుధవారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. రైల్వే జనరల్ కంపార్ట్‌మెంట్లలో వసతులు అధ్వానంగా ఉన్నాయని వాటిని పరిశీలించి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందించేలా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. రేణిగుంట రైల్వే స్టేషన్ స్థాయి పెంపునకు రూ.200 కోట్లతో ప్రాజెక్టు రిపోర్టు తయారుచేశారని, దాన్ని ఆమోదించి మంజూరు చేయాలన్నారు. స్టేషన్ అభివృద్ధిని శరవేగంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మంజూరైన కడప–బెంగళూరు లైన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. శ్రీకాళహస్తి–తిరుపతి రైల్వే లైన్ అభివృద్ధితోపాటు అమృత్ భారత్ పథకం ద్వారా కలికిరి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. రేణిగుంట–గూడూరు మార్గంలో 3వ లైన్‌ను మంజూరు చేయాలని కోరారు. తిరుపతి నుంచి మైసూర్ వరకు వందేభారత్ రైలు నడపాలని కోరారు. తిరుపతి నుంచి షిర్డీకి ప్రతిరోజు రైలు ఉండాలని తిరుపతివాసులు ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయుడుపేట స్టేషన్‌లో నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌కు, వెందోడు రైల్వే స్టేషన్‌లో కృష్ణ, పూరీ ఎక్స్‌ప్రెస్‌లకు తప్పనిసరిగా స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాజంపేట, కోడూరు, ఓబులవారిపల్లె, నందలూరు స్టేషన్లలో కోవిడ్‌కు ముందు ఉన్న అన్ని రైలు స్టాపింగ్‌లను పునరుద్ధరించాలని కోరారు. పండ్ల ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి లోడింగ్, అన్‌లోడింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరులో కోల్డ్ స్టోరేజీ సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు.

ఆడికృత్తిక ఉత్సవాలు పరిసమాప్తం



ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న చింతతోపు ఎస్టీకాలనీ వాసులు

- తెప్పపై భక్తులకు అభయ మిచ్చిన సుబ్రహ్మణ్యస్వామి

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమార గిరిపై ఉన్న వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. తొలుత అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించిచారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ముగించారు. భక్తులు ఐదో రోజు కూడా కావళ్లతో వచ్చి మొక్కులు చెల్లించారు.

–కనుల పండువగా తెప్పోత్సవం

స్కంధపుష్కరిణిలో వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి తెప్పోత్సవం భక్త జన సందడి నడుమ కోలాహలంగా నిర్వహించారు. చింతతోపు ఎస్టీకాలనీ వాసులు ప్రత్యేక వాయిద్యాల నడుమ స్వామివారికి సారె సమర్పించారు. పుష్కరిణిలో విహరిస్తున్న స్వామివారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

పలువురు డీఎస్పీల బదిలీ

చిత్తూరు ఎస్పీ సతీమణికి తిరుపతిలో పోస్టింగ్



హర్షిత

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారక తిరుమల రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు డీటీసీలో పనిచేస్తున్న డి.శ్రావణ్ కుమార్ ఏలూరు టౌన్‌కు, తిరుపతి డీటీసీలో విధులు నిర్వర్తిస్తున్న బుక్కే మురళిని పులివెందులకు, తిరుమల నుంచి కె.శ్రీనివాసాచారిని కర్నూలు దిశ స్టేషన్‌కు, తిరుపతి డీఎస్‌ఆర్‌బీ నుంచి షానూ షేక్‌ను పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే విజయవాడలో పనిచేస్తున్న బి.పార్థసారథిని కుప్పానికి, తిరుపతి పీటీసీ నుంచి ఘట్టమనేని శ్రీనివాసరావును నెల్లూరు రూరల్‌కు, తిరుపతి డీఎస్పీ కె.రవిమనోహరాచారిని సీఐడీకి, నెల్లూరు సీసీఎస్‌లో పనిచేస్తున్న పి.రామకృష్ణాచారిని తిరుపతి ట్రాఫిక్‌కు, తిరుపతి పీటీసీలో ఉన్న ఎం.రాజారావును విజయవాడ నార్త్‌కు, గూడూరులో పనిచేస్తున్న ఎం.సూర్యనారాయణరెడ్డి, నాయుడుపేటలో విధులు నిర్వర్తిస్తున్న వి.శ్రీనివాసరెడ్డి, శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డిని పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, చిత్తూరు ఎస్పీ మణికంఠ సతీమణి ఎస్‌ఆర్ హర్షిత మన్యం జిల్లా దిశ స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తుండగా ఆమెను తిరుపతి రైల్వేకు బదిలీ చేశారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇల్లు ఖాళీ చేయాలని..!

- టీడీపీ నేతల ఒత్తిళ్లతో రెవెన్యూ అధికారుల బెదిరింపులు
- న్యాయం చేయాలని బాధితుడి నివేదన



కృష్ణారెడ్డి కాపురం ఉన్న రేకు ఇల్లు

పాలసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలుకుని రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై టీడీపీ నేతల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. మండలంలోని కోదండరామపురంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కృష్ణారెడ్డిపై ఇదే కోవలో టీడీపీ నాయకులు కత్తి కట్టారు. బాధితుడి కథనం మేరకు..కోదండరామపురం రెవెన్యూ లెక్కల ప్రకారం కృష్ణారెడ్డికి సర్వే నంబర్ 9–1 లో 1.30 సెంట్ల వ్యయసాయ భూమి ఉంది. ఈ పొలం పక్కనే తన స్థలంలో 20 ఏళ్ల క్రితం కృష్ణారెడ్డి రేకులషెడ్డు వేసుకుని కాపురం ఉంటున్నాడు. దీనికి విద్యుత్ బిల్లులు సైతం కడుతున్నాడు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పక్షాన పనిచేశాడని టీడీపీ నాయకులు అతడిపై కక్ష కట్టారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తేవడంతో అధికారులు ఇల్లు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని కృష్ణారెడ్డి వాపోయాడు. ఉన్నతాధికారులైనా స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్ల జాయినింగ్ రిపోర్టు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు తిరిగి బదిలీపై జిల్లాకు విచ్చేశారు. బుధవారం పలువురు తహసీల్దార్లు కలెక్టరేట్‌లో జాయినింగ్ రిపోర్టులను అందజేశారు. కర్నూలు, అనంతపురం, వైఎస్‌ఆర్ కడప జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు అందరూ రిపోర్టు చేసిన తర్వాత పోస్టింగ్‌లపై కసరత్తు చేయనున్నారు. రాష్ట్ర అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి తహసీల్దార్లను సొంత రెవెన్యూ డివిజన్ కాకుండా మరో రెవెన్యూ డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వనున్నారు. 32 మండలాల్లో పోస్టింగ్స్ ఇచ్చేందుకు కలెక్టరేట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆగస్టు 8న ఎస్ఎంసీ ఎన్నికలు



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఆగస్టు 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్ఎంసీ కమిటీ ఎన్నికల నియమ, నిబంధనలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేశారన్నారు. ఈ ఎన్నికలకు పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 1న అన్ని స్కూళ్లలో హెచ్ఎంలు ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేస్తారని, 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ప్రమాణ స్వీకారం, మధ్యాహ్నం 3 గంటలకు మొదటి ఎస్ఎంసీ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు వివరించారు.

నియోజకవర్గ ఇన్‌చార్జి అధికారుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జి అధికారులను నియమిస్తూ బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అధికారిగా మైనారిటీ సంక్షేమశాఖాధికారి చిన్నారెడ్డి, పూతలపట్టు నియోజకవర్గానికి బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, కుప్పం నియోజకవర్గానికి బీసీ సంక్షేమశాఖాధికారి రబ్బానీబాషా, జీడీనెల్లూరు నియోజకవర్గానికి సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణరెడ్డి, పుంగనూరు నియోజకవర్గానికి హార్టికల్చర్ డీడీ మధుసూదన్ రెడ్డి, నగరి నియోజకవర్గానికి జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ, పలమనేరు నియోజకవర్గానికి డీఐసీ జీఎం చంద్రశేఖర్‌ను నియమించారు.

మద్యం మత్తులో సొంతింటికే నిప్పు పెట్టాడు

–రూ.4లక్షల ఆస్తినష్టం



చౌడేపల్లె : మద్యం మత్తులో సొంత ఇంటికే నిప్పు పెట్టాడో ప్రబుద్ధుడు. ఈ సంఘటన మండలంలోని కాటిపేరి పంచాయతీ గిరిజాపురంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన ఎం. ముత్తయ్య పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మత్తులో తన పూరి గుడిసెకు నిప్పు పెట్టడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. మంటల్లో కొయ్యసామగ్రి, వంటసామగ్రి, బట్టలు, బియ్యం, ధాన్యం, బంగారు నగలు, నగదు మొత్తం కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ:4 లక్షల మేరకు ఆస్తినష్టం సంభవించినట్లు అధికారులకు బాధితులు తెలిపారు.

నిఘా వ్యవస్థ పటిష్టం చేయండి

- క్రైమ్ మీటింగ్‌లో చిత్తూరు ఎస్పీ మణికంఠ



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నేరాల నియంత్రణకు నిఘా వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. బుధవారం చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. గ్రామాలు పట్టణాలు, నగరాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు విరివిగా ఉపయోగించాలన్నారు. అపార్టుమెంటు వ్యవస్థ, కమ్యూనిటీ హాళ్లు ఉన్న చోట కెమెరాల వినియోగంలో స్థానికులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఇప్పటికే అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ అవగాహన కలిగి ఉండాలన్నారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వారిపై పీడీ యాక్టులు పెట్టడానికి ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. ఒకసారి నిందితులను అరెస్టు చేసిన తరువాత, వారిపై నేరం రుజువు చేయడానికి సరైన సాక్ష్యాలు సేకరించి, కోర్టుకు సమర్పించాల్సిన బాధ్యత దర్యాప్తు అధికారిదేనని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు జరిగితే ప్రజలు ఫోన్–1930కు తక్షణం సమాచారం ఇవ్వాలని కోరారు. స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చేవారితో స్నేహపూర్వకంగా మెలగాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఆరీఫుల్లా, సుబ్బారావు, నాగేశ్వరరావు, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

రామకుప్పం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మండలంలోని మిట్టపల్లె సమీపంలో బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలసి ఉద్యాన రంగంలో విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు లాభసాటి వ్యవసాయం చేసేందుకు అవసరమైన ఆధునిక వ్యవసాయ పద్ధతులతోపాటు ప్రభుత్వ పథకాలతో కూడా లబ్ధి పొందాలన్నారు. అలాగే బ్యాంకు రుణాలు పొందడానికి ఉన్న పథకాలు, వాణిజ్య పంటలు, పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గంలో పూల సాగు ఎక్కువగా ఉండడంతో పూలు, కాయగూరలు, పండ్లు బెంగళూరుకు ఎగుమతి చేయవచ్చన్నారు. కడా పీడీ మాట్లాడుతూ, బ్యాంకు రుణాలు పొందదలచిన రైతులు ఈ నెల 10న కుప్పంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాన్ని రైతులకు అనుసంధానం చేయాలని మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం, హార్టికల్చర్ ఏడీ కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, చిన్నికృష్ణ, పీఎస్ మునిరత్నం, రైతులు పాల్గొన్నారు.

జానపద మాసోత్సవాన్ని సంబరంలా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న సంస్థ కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో జానపద మాసోత్సవాన్ని సంబరంలా నిర్వహిద్దామని మన సంస్కృతి కళా సంస్థ తిరుపతి సంస్థ అధ్యక్షులు సహదేవనాయుడు పిలుపునిచ్చారు. జానపద దినోత్సవం నిర్వహణపై చిత్తూరులోని రెవెన్యూ భవనంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు సంబరాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల వారీగా జానపద పాటల కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో హరినాయుడు, మనోహర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



'పొలంబడి'లో రైతులకు సాగు పద్ధతులను వివరిస్తున్న మురళీకృష్ణ

బంగారుపాళెం: వేరుశనగ సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని టేకుమందలో బుధవారం వేరుశనగ పంటపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సాగులో విత్తన మోతాదు, విత్తన శుద్ధి, పూత దశలో జిప్సం వాడకం, ఎరపంట, ఆకర్షక పంటలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన రైతులకు వివరించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీఓ) ద్వారా సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ధ్రువీకరణ పత్రం ఎలా పొందాలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమ అవగాహన కల్పించారు. ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలియజేశారు. అనంతరం రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమీక్షించారు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య, రైతు సేవా కేంద్రం సహాయకులు స్వాతి, గ్రామ కార్యదర్శి చెంగల్‌రాయులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.